# స్వాతిముత్యం

- ఇందిర మాలెంపాటి

"ఎంకెవ్వరని లోకమెప్పుడయిన కదిపితే
వెలుగునీడల వైపు వేలు సూపింతు"
-నాయుడు బావ

"నెలవంక పలకలో
నీరూపె గీతురా
తలవంచి సెలయేరులో
ఆ రూపె సూతురా" -ఎంకి




నాయుడు బావ, ఎంకిల ప్రేమభావనలో మనసుకు చల్లదనం కలిగించే మత్తు ఉంది. ఆ కవితలు చదువుతూ పుస్తకం గుండెలమీద పెట్టుకుని నిద్రలోకి జారిపోయింది స్వాతి. ఆ రోజే రాహుల్‌కు ఉత్తరం వ్రాసి పోస్టులో వేసింది. టెలిఫోనులూ, ఇంటర్నెట్‌లూ వచ్చాక ఉత్తరాలు వ్రాసే అలవాటు పోయింది. ఇమెయిల్స్ పెట్టటమే కాని అందులో మనసంతావిప్పి గుండెలో కొట్టాడుతున్న భావాలు చెప్పే అవకాశమే లేదు. ఎంకి, నాయుడు బావలాగ గుండె గొంతుకలోన కొట్టాడు తుంటే, మనసిప్పి ఊసులాడుకునే తీరికాలేదు. ఈ ఇంటర్నెట్ యుగంలో జీవితం రొబొటిక్‌గా, యాంత్రికంగా, వేగంగా జరిగిపోతోంది.

కాలం కరిగిపోతోంది. అందుకే ఈరోజు మనసంతా విప్పి తీరికగా తెల్ల కాగితం మీద పెట్టింది.

"రాహుల్,

"వెన్నల రాత్రిలో చందమామను చూస్తూ
నీతో ఊసులాడాలని, నీవు నాకు తోడుగా
నేను నీకు నీడగా కాలం గడపాలనీ
ఆశతో వేచి ఉన్నాను, నేను.
ఎక్కడో చుక్కల్లో దాగిన జాబిల్లిలా
అందకుండా ఉండిపోయావు నీవు.
కదిలి పోతోంది కాలం
తిరిగి రాదు కరిగి పోయిన మాయదారి కాలం"
-- "నీకోసం ఎదురు చూసే నీ స్వాతి."

ఫోన్ రింగ్ శబ్దానికి ఉలిక్కిపడి లేచింది స్వాతి. అవతలి నుండి రాహుల్ "స్వాతీ ఏం చేస్తున్నావు? సడెన్‌గా నీతో మాట్లాడాలనిపించింది. అఫ్‌కోర్స్, నీతో ఎప్పుడూ మాట్లాడాలనే ఉంటుంది. కాని ఫోన్‌లో అప్పుడప్పుడు మాత్రమే మాట్లాడగలం కదా! ఇంక నాలుగు నెలల్లో నీకు వీసా రావచ్చు. ఈ నాలుగు నెలలూ నాలుగు యుగాలనిపిస్తున్నది. అయినా మనం ఇలా విడివిడిగా ఉండటమేమిటి? ఉద్యోగం మానేసి వచ్చేయ్యనా? అక్కడే ఏదయినా చూసు కోవచ్చు. ఈ నరకం కంటే అదే మంచిదికదా".

"ఇంతకాలం వెయిట్ చేశాము. ఈ నాలుగు నెలలూ ఎంతలో గడుస్తాయి? రాహుల్ ఈ ఎడబాటు వల్ల మనం మానసికంగా మరింత దగ్గరవుతున్నా మనిపిస్తున్నది. ఒకరి కోసం ఒకరు తపన పడటంలో కూడా ఒక మధుర మయిన అనుభూతి ఉంది" అన్నది స్వాతి.

రాహుల్ ఫోన్ పెట్టేశాక స్వాతి ఆలోచనులు కాలేజీ రోజుల్లోకి పరిగెత్తాయి.

*******

బ్లూకలర్ సిల్క్ చుడీదారు వేసుకుని మాచింగ్ చెప్పులు వేసుకుని, విజయవాడ ఇంజనీరింగు కాలేజీ అడ్ మినిస్ట్రేటివ్ ఆఫీసు వైపు నడిచి వెడుతున్న స్వాతిని మొదటి సారిగా చూసినప్పుడు, రాహుల్ కళ్ళు తిప్పుకోలేకపోయాడు. దివినుండి భువికి దిగివచ్చిన దేవతలా కనిపించింది అతని కళ్ళకు. రాహుల్ కూడా ఆ రోజే ఇంజనీరింగు ఫస్ట్ యియర్‌లో చేరాడు. ఆమెను పలకరించాలనే కుతూహలం ఆపుకోలేక దగ్గరకు వెళ్ళి, "ఈరోజే కాలేజీలో చేరుతున్నారా?" అని అడిగాడు. "అవునండీ ఇప్పటికే ఆలశ్యం అయిపోయింది. ప్రిన్సిపాల్‌ని కలిసి స్కెడ్యూలు తీసుకుని క్లాసుకు

వెళ్ళాలి. మీరు ఏ యియర్ చదువుతున్నారు? ఏ బ్రాంచ్?" అని అడిగింది.

"నేను కూడా ఫస్ట్ యియర్-ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో చేరాను. గ్లాడ్ టుమీట్ యు. అయామ్ రాహుల్" అన్నాడు.

"అయామ్ స్వాతి. ప్లీజ్ టు మీట్‌యు."

స్వాతి వాళ్ళ అన్నయ్యా, వదినా విజయవాడలోనే ఉంటారు. వాళ్ళ అన్నయ్య రాజశేఖరం డాక్టరు. విజయవాడలోనే ప్రాక్టీసు చేస్తున్నారు. స్వాతి, వాళ్ళింట్లోనే ఉండి చదువుకోవటానికి ఏర్పాట్లు జరిగాయి. వాళ్ళది గుడివాడ దగ్గర చిన్న పల్లెటూరు నాన్న జనార్దనరావుగారు వ్యవసాయం చేసుకుంటూ ఉంటారు. వేసవికాలంలో పల్లెటూర్లో గడపటం స్వాతికి చాలా సరదాగా ఉంటుంది. తాటి ముంజలు కొట్టించుకుని తినటం, చెట్ల నుండి పచ్చి మామిడి కాయలు కోసి ముక్కలు చేసుకుని కారం అద్దుకుని తినటం ఇవన్నీ ఎంతో బాగుంటాయి.

నాన్నగారు ఐదారు ఎకరాల పొలంతోనే పిల్లలందరికీ కాలేజీ చదువులు చెప్పించారు. స్వాతి తమ్ముడు చంద్రశేఖర్ కాలేజీలో సెకండియర్ ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు.మధ్యతరగతి కుటుంబాలలో ఉండే సమస్యలు ఉండనే ఉంటాయి. స్వాతి పెళ్ళి గురించే ఆయనకు ఆందోళన.

స్వాతి వాళ్ళ అమ్మ శారద, స్వాతికి నాలుగేళ్ళ వయసప్పుడే చనిపోయింది. అమ్మ జ్ఞాపకాలు కొద్ది కొద్దిగా ఏదో కలలో జరిగినట్లు కనిపిస్తూ ఉంటాయి. అమ్మ ఎలా చనిపోయిందో తనకు తెలియదు. హార్ట్‌ఎటాక్ అని కొందరూ, కాన్సర్ అని కొందరూ చెబుతూఉంటారు. ఆరోజుల్లో, ఆపల్లెటూర్లో వైద్య సహాయం ఏమీ ఉండేది కాదు. ఏదో కాలం మూడిపోయింది, మహర్జాతకురాలు వెళ్ళిపోయింది అనుకుంటూ ఉంటారు. ముత్తయిదుగా పోవటం అదృష్టం అని కూడా అంటారు.

ఆమె ఉండగా ఇల్లంతా కళకళలాడుతూ ఉండేదని కథలు కథలుగా చెబుతారు. 'పెద్దంచు గద్వాల చీర కట్టుకుని, నుదిటి మీద పెద్దబొట్టుతో ఒంటినిండా నగలతో మహలక్ష్మిలా నట్టింట తిరుగుతూ ఉంటే ఎంత నిండుగా ఉండేదో' అంటూ ఉంటారు.

జనార్దనరావు గారి చెల్లెలు లక్ష్మీకాంతమ్మ ఇంట్లోనే ఉండేది. పదహారేళ్ళ వయస్సులో పెళ్ళిచేసి అత్తవారింటికి పంపిస్తే, పదిహేడవ సంవత్సరానికే పుట్టింటికి వచ్చేసే పరిస్థితి వచ్చింది. ఆమె భర్త రాఘవరావు ఎలా చనిపోయాడో ఎవరికీ అంతు పట్టలేదు. చెడుతిరుగుళ్ళ వల్ల ఎయిడ్స్ జబ్బుతో చనిపోయాడని అంటారు కొందరు. ఏది ఏమయినా లక్ష్మీకాంతమ్మ పదిహేడేళ్ళ వయసుకే బొట్టు చెరుపుకుని, తెల్లచీర కట్టుకుని పుట్టింటికి వచ్చింది. ఆమె ఎక్కువ చదువులు చదువు కోలేదు. అన్నయ్య జనార్దనరావుగారి అండలోనే ఉండవలసిన అవసరం ఏర్పడింది. లక్ష్మీకాంతమ్మ హైస్కూలు చదువు పూర్తికాక ముందే సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. అబ్బాయి అందంగా ఉన్నాడు, మంచి కుటుంబం మంచి సంబంధం అని త్వరపడ్డారు. అబ్బాయి మనస్తత్వం గురించి కానీ, అతని చెడుతిరుగుళ్ళ గురించి కానీ ఎవరూ తెలుసు కోలేకపోయారు. లక్ష్మీకాంతం తనకు పెళ్ళి కుదిరిందనే సరదా, కొత్తబట్టలూ నగలూ వస్తున్నాయనే సంతోషమే కాని, కట్టుకోబోయే మొగుడు ఎలాంటివాడు, అతని ఆలోచనలేమిటి? అని ఆలోచించే అవగాహనలేదు. జీవితమంతా కలిసి ఉండాల్సిన వ్యక్తిని గురించి వివరాలు తెలుసుకోవాలనే కుతూహలం కూడా ఆ అమ్మాయికి లేదు. పెద్దలు చూస్తున్నారు, వాళ్ళకు మంచిచెడూ తెలియదా అనే భరోసా తప్ప స్వంతగా ఆలోచించే వ్యక్తిత్వం రాని వయసు.

పుట్టింటికి చేరిన లక్ష్మీకాంతం అన్నగారి పిల్లల బాధ్యత తీసుకోవలసి వచ్చింది. ఇంట్లో వంట చేయటం, పిల్లలకు కావలిసినవి ఏర్పాటు చేయటంలో ఆమెకు రోజంతా గడిచిపోయేది. అత్తయ్య గురించి ఆలోచిస్తే స్వాతికి చాలా బాధ కలుగుతుంది.

తన కంటే పన్నెండేళ్ళే పెద్దయినా అరవయ్యేళ్ళ వయస్సున్న మనిషిలా మాట్లాడుతుంది. ఏ అనుభవాలకూ, ఆనందాలకూ నోచుకోకుండా ఆమె జీవితం వెళ్ళబోస్తూ ఉంటే స్వాతికి ఈ కృత్రిమ సాంప్రదాయాలమీద చాలా కోపం వస్తుంది. నాన్నతో చాలా సార్లు వాదించింది. అత్తయ్యకు మళ్ళీ పెళ్ళి చేయకూడదా నాన్నా? లేకపోతే ఆమెను కాలేజీకి పంపించి చదువన్నా చెప్పించండి - అంటూ.

లక్ష్మీకాంతానికి చదువు మీద ఆసక్తీ, ధ్యాసా ఎప్పుడూ లేవు. ఇంటిపనులు చూసుకోవటం, కుట్లూ, అల్లికలతో కాలక్షేపం చేయటంలోనే కాలం గడిచిపోతోంది.

రాహుల్‌తో పరిచయమయిన తరువాత తన ఇంటి సంగతులన్నీ చెబుతూ స్వాతి అనేది - "అత్తయ్యను చూస్తూఉంటే, నేను కూడా ఆమెకు ఏమీ చెయ్యలేకపోతున్నానే అని బాధవేస్తుంది రాహుల్!"

"వాళ్ళ మానసిక స్థాయి ఎదిగి, వాళ్ళలో చైతన్యం వస్తే తప్ప, మనకుగా మనం ఏమీ చెయ్యలేం స్వాతీ! ఆచైతన్యం ఆమెకు కలిగినప్పుడు నీవు సహాయం చేయటానికి సిద్ధంగా ఉండాలి."

రాహుల్ కూడా మధ్య తరగతి కుటుంబానికి చెందినవాడే. వాళ్ళ నాన్న స్కూలు టీచరు. అక్క మాధవికి పెళ్ళయింది. బావగారు ఇంజనీరు. వాళ్ళు విజయవాడలో ఉంటారు. రాహుల్ అక్కావాళ్ళింట్లో ఉండి చదువుకుంటున్నాడు. అక్కపెళ్ళికీ, తన చదువుకూ, చాలా అప్పులు చేయవలసి వచ్చింది. రాహుల్ పెళ్ళికి వచ్చే కట్నంతో ఆఅప్పులన్నీ తీర్చాలని రాహుల్ నాన్నగారి ఆలోచన.

ఇంజనీరింగు రెండో సంవత్సరంలోకి వచ్చే సరికి స్వాతీ రాహుల్‌ల తొలిపరిచయం స్నేహంగా మారింది. సరదాగా కలిసి సినిమాలకు వెళ్ళటం, కలిసి చదువుకోవటం లాంటివి చేసేవారు. ఆఖరి సంవత్సరం లోకి వచ్చేసరికి ఒకరినొకరు చూడకుండా ఉండలేనంత సన్నిహితులయ్యారు. ఒక సారి రాహుల్ అడిగాడు "స్వాతీ మనం పెళ్ళి చేసుకుంటే ఎప్పటికి కలిసే ఉండొచ్చు కదా?" "అవును రాహుల్, నాకూ అలాంటి కోరికే కలుగుతోంది.".

పెళ్ళి విషయం, ఇద్దరి ఇళ్ళల్లో పెద్ద సమస్యగా తయారయింది. ముఖ్యంగా రాహుల్ వాళ్ళ ఇంట్లో, కట్నం లేకుండా చేసుకోవటం రాహుల్ వాళ్ళ నాన్నకూ అమ్మకూ ఇష్టం లేదు. కట్నం ఇచ్చే తాహతు స్వాతి వాళ్ళ నాన్నగారికి లేదు. "నాన్నా నాకు కట్నం తీసుకోవటం అసలు ఇష్టం లేదు. నాకు నచ్చిన అమ్మాయి, నన్ను అర్థం చేసుకునే అమ్మాయి స్వాతి.పెళ్ళంటూ చేసుకుంటే, స్వాతిని తప్ప మరెవరినీ చేసుకోను" అన్నాడు రాహుల్ తండ్రితో.

జనార్ధనరావుగారికి కూడా ఈ పెళ్ళి విషయం చాలా అసంతృప్తిగా ఉంది.

ఆడపిల్ల తన పెళ్ళివిషయం తనే నిర్ణయించుకోవటం ఆయనకు అసలు ఇష్టం లేదు. స్వాతికి చదువు చెప్పించటం చాలా పొరపాటయింది. తండ్రి చాటున ఉండవలసిన ఆడపిల్ల ఎంత స్వతంత్రమయిన నిర్ణయాలు తీసుకుంటోంది.

ఎంతమందికి అసంతృప్తి కలిగించినా స్వాతీ, రాహుల్ రిజిష్టరు మారేజి చేసేసుకున్నారు. లక్కీగా చదువు పూర్తవగానే ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చేశాయి. జీవితం సాఫీగా గడిచిపోతోంది.

ఇద్దరూ అమెరికా కొద్దికాలం వెళ్ళి వద్దామని, హెచ్ వన్ బి వీసాకు అప్లైచేశారు. రాహుల్‌కు వెంటనే వీసా వచ్చింది. స్వాతి కొన్నాళ్ళు ఉద్యోగం చేసుకుంటూ, వీసా కోసం వెయిట్ చేద్దామని నిర్ణయించుకుంది. రాహుల్ వెళ్ళిన కొద్ది కాలానికే, ఆఎడబాటు ఎంత కష్టంగా ఉంటుందో ఇద్దరికీ అర్థమయింది.

కాని ఎవరి జీవితం ఏ మలుపులు తిరుగుతుందో ఊహించటం కష్టం. స్వాతికి వీసా కొద్దినెలలలో వస్తుందనగా అనుకోని సంఘటనలు జరిగిపోయాయి.

రాహుల్ నుండి ఒక నెల రోజులుగా ఫోను కాని, ఇమెయిలు కానీ రాలేదు. స్వాతి పదిసార్లు ఫోన్ చేసినా ఆన్సరు లేదు. కనీసం ఒక పాతిక ఇమెయిల్స్ పెట్టింది. దీనికీ జబాబు లేదు. ఏమయింది రాహుల్‌కు? ఎంత పనివత్తిడి ఉన్నా రెండు నిమిషాలు ఫోన్ చేసి మాట్లాడ వచ్చుకదా! సరే నేనూ చూస్తాను. ఎన్నాళ్ళు మౌనంగా ఉంటాడో!

ఎప్పుడూ లేనిది, అమెరికా నుండి పెద్ద ఉత్తరం వచ్చింది.

స్వాతీ! ఇన్నాళ్ళూ నిన్ను మభ్యపెట్టినందుకు నన్ను క్షమించు. నేను నెలరోజులుగా మథనపడి నీకు ఎలా తెలియపరచాలో అర్థం కాక ఇప్పటికి రాస్తున్నాను.

నీవు లేకుండా బ్రతకలేనని, నువ్వంటే ప్రాణమని నేను ఎన్నో సార్లు అన్నాను. కాని మనిషి మనసు ఎంత త్వరగా మారిపోతుందో ఇప్పుడర్థమవుతోంది. మన పరిస్థితుల ప్రభావం కానీ ఇంత దూరంలో ఉండటం వలన కానీ, నాకు ఇదివరకటి ఫీలింగ్స్ ఇప్పుడు లేవు.... నాకు ఇక్కడ మరొకరితో పరిచయమయింది. మారుతున్న కాలాన్ని, మానవ నైజాన్ని అర్థం చేసుకోవాలి. మేము త్వరలో పెళ్ళి చేసు కోవాలను కుంటున్నాము. నన్ను గురించి నీవేమనుకున్నా ఫరవాలేదు. నేను నాజీవితం గురించి ఆలోచించు కున్నట్లే నీ జీవితం గురించి నీవు ఆలోచించుకో. అంత కంటే నేను చెప్పగలిగేదేమీ లేదు.

ఈ కవరులో డైవర్సు పేపర్లు పంపిస్తున్నాను. అవి సంతకం చేసి మళ్ళీ నాకు పోస్ట్ చేయి. ఇద్దరూ అనుకూలంగా సంతకాలు పెట్టుకుంటే విడాకులు రావటం చాలా తేలిక."

- రాహుల్

ఇది నిజంగా రాహుల్ వ్రాసిన ఉత్తరమేనా చేతివ్రాత అతనిదే కాని రాసిన వాక్యాలు అతని మనసులోంచి వచ్చినవేనా? స్వాతికి చాలా అయోమయంగా ఉంది. ఏవిషయమూ అంతు పట్టటం లేదు - తను ఇది వరకు చాలా కధలు విన్నది. అమెరికా వెళ్ళిన జంటలు ఎంతోమంది విడిపోవటం - ఇదేమీ కొత్తకాదు. కాని రాహుల్ అలాంటి వాడు కాదు. ఇందులో ఏదో పొరపాటు ఉంది. రాహుల్ వ్యక్తిత్వాన్ని అంచనా వేయటంలో తను అంత పొరపాటు చేసిందా... కాదు! కాదు. రాహుల్ ఏదో దాచిపెడుతున్నాడు.

అనూష తన క్లోజ్ ఫ్రండ్ తనతో పాటే ఇంజనీరింగు చదివింది.చదువుతూనే పెళ్ళయిపోయింది. అమెరికా సంబంధం వచ్చిందని వాళ్ళవాళ్ళంతా ఎంతో సంతోషపడ్డారు. అనూష ఫామిలీ చాలా డబ్బున్న వాళ్ళు అనూషా వాళ్ళ నాన్నగారు కోట్లలో వ్యాపారం చేస్తారు. ఆ అమ్మాయి పెళ్ళికి బహుశా కోటిరూపాయలు ఖర్చుపెట్టి ఉంటారు. ఐదు రోజుల పెళ్ళి చాలా ఆరాటంగా చేశారు. తెలుగు సాంప్రదాయలతో పాటు ఉత్తరభారత సాంప్రదాయాలు కూడా కలవేసి, మెహందీ అని ఒక రోజు, గర్బా అని ఒక రోజు ఇలా ఐదు రోజుల ఫెస్టివిటీస్‌తో ఎంతో ఆరాటంగా జరిగింది. పెళ్ళయిన ఆరునెలలకు తనకు వీసావస్తే అమెరికా వెళ్ళిపోయింది. చాలా సంతోషంగా ఉన్నట్లు ఉత్తరాలు వ్రాసేది.

నాలుగయిదు నెలలు గడిచిం తరువాత అనూష దగ్గరనుండి ఉత్తరాలు రావటం ఆగిపోయింది. కొత్తగా పెళ్ళయిన అమ్మాయి, స్నేహితురాలికి ఉత్తరాలు వ్రాస్తూ గడుపుతుందనుకోవటం తెలివి తక్కువ. అందుకే ఆ విషయం గురించి ఎక్కువ ఆలోచించలేదు.

సడన్ గా ఒక రోజు అనూష ఫోన్ చేసింది. "స్వాతీ! నేను ఇండియా తిరిగి వచ్చేశాను నేను అక్కడ ఆ ఇరుకు జీవితంలో ఇమడలేను. "

"ఏమయింది, అనూషా నీవు చాలా సంతోషంగా ఉన్నావనుకున్నాను. అసలేం జరిగింది? "

"ఏముంది, సుధీర్ గురించి నాకు పెళ్ళికి ముందు ఏమీ తెలియదు. ఏదో నాలుగయిదు ఈ మెయిల్స్ పెట్టుకోవటం, ఫోటో చూసి చాలా బాగున్నాడనుకోవటం తప్ప నాకు అతని గురించి ఏమీ తెలియదు. డబ్బు విషయంలో అతను చాలా టైట్‌గా ఉంటాడు. బడ్జెట్ లోనే ఖర్చుపెట్టు కోవాలంటాడు. షాపింగ్‌కు వెళితే ఏమీ కొననివ్వడు. నాన్న డబ్బు పంపిస్తారు నా ఖర్చులకంటే అతనికి నచ్చలేదు. విపరీతమయిన కోపం వచ్చిందతనికి."

"అదేమిటి అనూషా? ఇవన్నీ వింటూఉంటే అతను మంచి ప్రిన్సిపుల్స్ ఉన్న వ్యక్తిలా అనిపిస్తోంది. నీవే తొందరపడుతున్నావేమో ఆలోచించు."

"అది కాదు స్వాతీ! నాకసలు అమెరికా జీవితమే నచ్చలేదు. గిన్నెలు కడుక్కోవటం, బట్టలు ఉతుక్కోవటం, ఇస్త్రీ చేసుకోవటం దగ్గరనుండీ అన్ని పనులూ మనమే చేసుకోవాలి. వీటన్నిటితో పాటు, ఇంకా కాలేజీలో ఏవో కోర్సులు తీసుకోమంటాడు. ఒక సరదా కూడా ఉండదు.

ఒక క్లబ్బుకు వెళ్ళటం కాని, ఒక పార్టీకి వెళ్ళటం కాని ఏమీ ఉండదు. ఆ ఇరుకు జీవితం నాకసలు నచ్చలేదు. ఇండియా వెళ్ళిపోదాం రమ్మన్నాను. నాజాబ్ నాకు నచ్చింది. కొన్ని సంవత్సరాల దాకా నేను రానంటాడు. అందుకే వచ్చేశాను. నేనిక అక్కడికి వెళ్ళను." అన్నది.

స్వాతికి చాలా ఆశ్చర్యమేసింది. ఇంత చిన్న విషయానికి భర్యాభర్తలు విడిపోతారా? ఇలాంటి సంఘటనలు చాలా విన్నది. వాళ్ళ అవగాహనలో పొరపాటు ఉందేమో అనుకునేది. కానీ ఇప్పుడు రాహుల్ నుండి అలాంటి ఉత్తరం వచ్చాక ఏమనుకోవాలో తెలియటంలేదు. రాహుల్, తనూ ఇష్టపడి, ఒకరినొకరు బాగా అర్ధం చేసుకున్న తరువాతే పెళ్ళిచేసుకున్నారు. అసలు ఈ వివాహవ్యవస్థలోనే ఏదో లోపం ఉంది. తన ప్రేమనంతా మాటలలో నింపి, తన మనసు స్పందించే విధంగా వ్యవహరించే రాహుల్ ఇలాంటి ప్రలోభంలో పడతాడంటే తనకు నమ్మశక్యం కావటంలేదు. వెంటనే అతని దగ్గరకు వెళ్ళి ముఖాముఖి మాట్లాడదామంటే తనకు వీసా ఇవ్వరు. ఏం చేయాలి? చేసుకున్న బాసలూ, కన్న కలలూ అన్నీ కల్లలేనా? కాని ఎందుకో రాహుల్ మీద కోపం రావటం లేదు. ఆ డైవర్సు పేపర్లు మాత్రం తను సంతకం పెట్ట దలుచుకోలేదు.

ఆ ఉత్తరం అన్నయ్యకు చూపించి "అన్నయ్యా నీకు తెలిసిన వాళ్ళెవరికయినా ఫోన్ చేసి విషయాలు

తెలుసుకోమని చెప్పగలవా? నాకు అతను వ్రాసిన వేవీ నమ్మ బుద్ధికావటం లేదు." అని అడిగింది.

"నేను మొదట్లోనే చెప్పాను. నీవు అతని విషయంలో తొందరపడుతున్నావేమోనని. నీవు వినిపించుకోలేదు. అతను అంత క్లియర్‌గా వ్రాస్తే ఇంకా నీకు అనుమానమెందుకు? అతని సంగతి మరిచిపోయి నీ జీవితం గురించి ఆలోచించు. " అన్నాడు.

ఎవరెన్ని విధాల చెప్పినా స్వాతి మనసులో అపనమ్మకం పోవటంలేదు. ఏదో బలవంతమయిన కారణం ఉండి ఉంటుంది. రాహుల్ చపలచిత్తుడు కాడు. అతను చాలా డీసెంటుగా ఆలోచిస్తాడు. ఎన్నో అభ్యుదయ భావాలున్నాయి.

అమెరికా నుండి ఫోనులు చేసే రోజుల్లో అతను అక్కడి విషయాలు కొన్ని చెప్పేవాడు. అతను చెప్పే కధలలో ఇతరుల పట్ల జాలి అభిమానం, కష్టంలో ఉన్న వాళ్ళకు సహాయం చేయాలనే తపనా కనిపిస్తాయి.

ఒకసారి వాళ్ళ పక్కింటి వాళ్ళ కధ చెప్పాడు. "మా ఎపార్టుమెంటు కాంప్లెక్సులో మాకు క్రింద భాగంలో ఒక అమెరికన్ ఫామిలీ ఉంటున్నారు. బాబ్, లిండా వారిద్దరికి ఇద్దరు పిల్లలు. ఇద్దరూ అమ్మాయిలే వాళ్ళకు ఆరేళ్ళూ, మూడేళ్ళూ, ఎంతో ముద్దుగా ఉంటారు. బాబ్ ఒక కారుడీలరు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. లిండా ఇంట్లోనే ఉండి పిల్లల్ని చూసుకొనేది. వాళ్ళు ఎప్పుడూ ఎంతో ఉషారుగా, సంతోషంగా కనిపించేవాళ్ళు. రోజూ సాయంత్రం పిల్లలిద్దరినీ తీసుకుని ఎదురుగా ఉన్న పార్కుకు వెళుతూ కనిపించేవారు.

సడెన్‌గా లిండాకు బ్రెస్ట్ కాన్సర్ అని డయాగ్నోస్ చేశారు. ఆపరేషను చేశారు. తరువాత రేడియేషన్ థెరపీ ఇచ్చారు. ఇంకా కీమోథెరపీ కూడా ఇవ్వాలన్నారట. ఈ ట్రీట్‌మెంటు కంతా బాబ్ జాబ్‌లో ఇచ్చే ఫామిలీ ఇన్సూరెన్సు ద్వారా పే చెయ్యగలిగారు. ఇంతలో సడెన్‌గా బాబ్‌కు ఉద్యోగం పోయింది. హెల్త్ ఇన్సూరెన్సుపోయింది. కీమోథెరపీకి చాలా ఖర్చవుతుంది. లిండా చాలా నీరసంగా ఉండేది. ఖర్చు భరించలేక కీమోథెరపీ ఆపేస్తానంటున్నది. కళ్ళముందే వాళ్ళ పరిస్థితి దిగజారి పోవటం చూస్తే చాలా బాధేస్తుంది. ఇంత ధనవంతమయిన అమెరికా దేశంలో ఇలాంటి దీనమయిన పరిస్థితి చూస్తే ఆశ్చర్యమేస్తుంది. అప్పుడప్పుడు ఆపిల్లల్ని దగ్గర పెట్టుకుని బేబీసిట్టింగ్ చేసి ఆమెకు రిలీఫ్ ఇస్తున్నాను. ఇంతకంటే నేను చేయగలిగింది ఏముంది?" అతని కంఠంలో ఆ కుటుంబంపట్ల జాలీ, తనేమీ చెయ్యలేకపోతున్నాననే బాధ స్పష్టంగా తెలుస్తున్నాయి.

మరొక సారి ఇంకొక కధ చెప్పాడు.

"ఇన్నర్ సిటీలో పిల్లలకు చదువులు సరిగ్గా ఉండవు. స్కూళ్ళకు సరయిన ఫండింగ్ లేక సరిపోయినంత మంది టీచర్లు ఉండరు. పిల్లలకు ఎడ్యుకేషను సరిగ్గా ఉండదు. ఆ పరిస్థితులలో పిల్లలు చెడ్డ అలవాట్లలో పడిపోవటం చాలా తేలిక. వాళ్ళ ఫామిలీ లైఫ్‌లో కూడా ఒక స్ట్రక్చర్ ఉండదు. చాలా వరకు వాళ్ళ జీవితాల్లో తండ్రి ప్రమేయం లేకపోవటం తల్లి ఒక్కతే పెంచటం జరుగుతూ ఉంటుంది. ఒకోసారి కుటుంబం గడవటం కోసం, తల్లి రెండు జాబ్‌లు చేయటం, దాంతో పిల్లలకు సూపర్ విజన్ లేక విచ్చలవిడి తనం అలవాటవుతుంది. ఇల్లీగల్ డ్రగ్స్ వాడటం, అమ్మటం లాంటివి కూడా చేస్తారు. అందుకే కొన్ని చోట్ల "బిగ్ బ్రదర్" ప్రోగ్రాము ఉంటుంది. ఒకబ్బాయిని బ్రదర్‌గా తీసుకుని, వాళ్ళకు చదువుమీద శ్రద్ధకలిగేట్లు చేయటం, ఆటలు ఆడించటం, చెడ్డ అలవాట్లలో పడకుండా చేయటం లాంటి పనులు చేయాలి.

నేను కూడా శని ఆదివారాలు 'క్రిస్' అనే అబ్బాయిని వెంట బెట్టుకుని 'బిగ్ బ్రదర్'గా అతనితో గడుపుతాను.

ఇంత ఆదర్శంగా ఆలోచించే రాహుల్ అంత దారుణంగా ప్రవర్తిస్తాడని, తను ఊహించలేక పోతోంది.

రాహుల్ ఫ్రెండ్స్ కెవరికయినా ఫోన్ చేద్దామంటే వాళ్ళ ఫోన్ నంబర్లు తెలియవు. ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో మరో నెలరోజులు గడిచి పోయాయి. ఆనెల తరువాత మరో ఉత్తరం వచ్చింది. చాలా క్లుప్తంగా ఉన్నది.

స్వాతీ, నెలరోజుల క్రితం నీకు పేపర్లు పంపించాను. అవి వెంటనే సంతకం చేసి కొరియర్లో పంపించు. నాకు ఎక్కువ టయిము లేదు.

రాహుల్

ఉత్తరంలో అక్షరాలన్నీ ఒంకరటింకరగా ఉన్నాయి. ఏదో హడావిడిలో గిరికినట్లున్నాయి.

ఇంత క్లుప్తంగా ఏవిధమయిన వివరాలూ లేకుండా, ఇలాంటి ఉత్తరం చూస్తే స్వాతికి చాలా ఆశ్చర్యం కలిగింది. అసలు విషయం ఏమిటో తెలుసుకోవాలనే పట్టుదల పెరిగింది.

అనూష భర్త స్టేట్స్‌లో బోస్టన్‌లో ఉంటాడని గుర్తుంది. - ఆరోజే అనూష దగ్గరకు వెళ్ళి, అతని అడ్రసు, ఫోన్ నంబరూ తీసుకుంది.

"సుధీర్ గారూ, మీకు నేను తెలియదు. నా పేరు స్వాతి. మీ పెళ్ళికి నేను వచ్చాను. నేనూ, అనూషా క్లోజ్ ఫ్రెండ్స్ ఎప్పటి నుండో. నాకు మీ నుంచి ఒక సహాయం కావాలి."

"చెప్పండి నేను చేయగలిగిందేమయినా ఉంటే తప్పక చేస్తాను."

"బోస్టన్‌కు న్యూయార్క్ మరీ దూరమేమి కాదుగదా! నేను మిమ్మల్ని శ్రమపెట్టాల్సి వస్తోంది - కాని ఇది నాజీవితానికి సంబంధించిన విషయం" అని మొదటినుండీ వివరాలన్నీ చెప్పింది. రాహుల్ మొదటి నుండి ఎలా ఉండే వాడో, ఈ రెండు నెలలుగా ఎలా విచిత్రంగా ప్రవర్తిసున్నాడో అన్నీ వివరంగా చెప్పింది. అతను వ్రాసిన రెండు ఉత్తరాల గురించి చెప్పింది. ఈమెయిల్స్‌కు ఆన్సర్ చేయక పోవటం, ఫోనులో దొరక్కపోవటం అన్నీ చెప్పింది.

"సుధీర్‌గారూ! రాహుల్ ఎలాంటివాడో నాకు బాగా తెలుసు. ఏదో అనివార్యకారణాలవల్ల ఇలా చేస్తున్నాడని నా అభిప్రాయం. మీరు ఏమీ అనుకోకపోతే, నాకోసం ఒకసారి న్యూయార్క్ వెళ్ళి విషయం కనుక్కోండి." రాహుల్ ఫోన్ నంబరూ, అడ్రసూ ఇచ్చింది.

"తప్పకుండా వీకెండ్ మాత్రం నాకు వీలవుతుంది. న్యూయార్క్‌లో నాకు ఒక ఫ్రెండ్ ఉన్నాడు. త్వరలో అక్కడకు వెళ్ళి, విషయం తెలుసుకుని మీకు ఫోన్ చేస్తాను."

----------

ఆరోజు సెప్టెంబరు పదకొండవతేదీ (2001) అన్ని రోజులలాగానే ఆరోజూ సూర్యుడు తూర్పున ఉదయించాడు. రోజూలాగే ఉదయం ఎనిమిది గంటల కల్లా పిల్లలు స్కూళ్ళకూ, పెద్దవాళ్ళు ఉద్యోగాలకూ బయలుదేరి వెళ్ళారు. రాహుల్ కూడా ఉదయంలేచి, బ్రేక్ ఫాస్ట్‌కు బేగల్ తిని హడావిడిగా వర్క్‌కు బయలు దేరాడు. అతని ఎపార్టుమెంటు, వర్క్ ప్లేసుకు చాలా దగ్గర పదినిముషాలు వాకింగు. ఈ మహా పట్నంలో వర్క్, వాకింగ్ డిస్టెన్సులో ఉండటం మహాభాగ్యం.

ఆ ట్రాఫిక్‌లో కారులో వెళ్ళాలన్నా, కారు పార్క్ చేయాలన్నా గంటలు పడుతుంది.

అది సెప్టెంబరు నెల కావటంతో అప్పుడప్పుడే కొంచెం చలి ప్రారంభమవుతోంది. పలచగా ఉండే ఫాల్ జాకెట్ వేసుకుని, రాహుల్ నడుచుకుంటూ ఆఫీసుకు బయలు దేరాడు. అతని ఆఫీసు వర్ల్డ్‌ట్రేడ్ సెంటరు, ట్విన్ టవర్స్‌లో ఒక టవరు నాల్గవ అంతస్తులో ఉంది. ఎలివేటరు తీసుకుని ఆఫీసుకు వెళ్ళి డెస్క్ దగ్గర కూర్చున్నాడు. ఆరోజు వర్క్ ఏమి పూర్తి చేయాలో చూస్తున్నాడు. టయిము దాదాపు ఉదయం 8:30 గంటలయి ఉండొచ్చు సడెన్‌గా చాలా పెద్ద శబ్దం వినిపించింది. ఎంత పెద్ద శబ్దం అంటే ప్రళయం వస్తుందా అన్నంత భయంకరంగా ఉంది. అదే సమయంలో బెల్డింగ్ అంతాషేక్ అవుతున్న ఫీలింగు - వీటన్నిటితో పాటు విపరీతమయిన పొగలు. ఏమీ కనపడటం లేదు. అందరూ గందరగోళంగా పరిగెత్తుతున్నారు. బిల్డింగ్‌లో ఫైర్ మొదలయిందేమో అనుకున్నాడు. ఎవరి దారిన వాళ్ళు పరుగులు పెడుతున్నారు. ఎలివేటరు ఉపయోగించ గూడదనే విషయం అర్ధమయింది. అందరూ బిల్డింగ్ లో నుండి బయట పడటానికి ప్రయత్నిస్తున్నారు. ఆ సమయంలో ఎవరేం చేస్తున్నారో అర్ధం కావటంలేదు. ప్రాణాలతో బయటపడాలంటే బయటికి వెళ్ళిపోవాలి అని మాత్రం అర్ధం మవుతోంది. త్వరగా బాల్కనీ దగ్గరకు వెళ్ళి, ధైర్యంగా క్రిందికి దూకేశాడు రాహుల్. ఆ తరువాత అతనికి ఏమీ తెలియలేదు. స్పృహతప్పింది. కళ్ళు తెరిచే సరికి హాస్పిటలు బెడ్ లో ఉన్నాడు.

కొంచెం తేరుకుని విషయం అర్ధం చేసుకునే లోపల డాక్టరు రౌండ్స్‌కు వచ్చారు. "మిస్టర్ రాహుల్ ! వుయి డిడ్ నాట్ హావ్ ఎనీ చాయిస్.... వుయ్ హాడ్ టు యాంపుటేట్ బోత్ యువర్ లెగ్స్ ఎబౌ ది నీస్"... కాసేపు ఆగి మళ్ళీ అన్నారు ఇంగ్లీషులో "మీ ఫామిలీ మెంబర్సుకు ఎవరికెయినా కబురు చేయమంటే సేస్తాము అడ్రసు, ఫోన్ నంబరూ చెప్పండి. మీరు కొంత రికవర్ అయ్యాక ప్రోస్తిసిస్‌కు ఆర్డరిద్దాము. అంతవరకూ రీహాబ్ వాళ్ళు హెల్ప్ చేస్తారు. క్లచ్చర్సుతో నడవటానికి ప్రయత్నించండి."

రాహుల్‌కు ప్రపంచ మంతా తలక్రిందులయినట్లు అనిపించింది. ఏమంటున్నారు? తనకు రెండు కాళ్ళూ లేవా? స్వాతిని వెంటనే చూడాలని తహతహ కలిగింది. ఆమె వళ్ళో తల పెట్టుకుని భోరున ఏడవాలని పిస్తోంది. --- కాని కానీ, అమ్మో స్వాతికి ఈ విషయం

తెలియకూడదు. ఈస్థితిలో తను స్వాతిని కలవకూడదు - అందుకే తనకెవరూ లేరనీ, ఎవరికీ తెలియ పరుచనవసరం లేదనీ చెప్పాడు డాక్టర్లకు.

ఆ పాపిష్టి రోజు ఏం జరిగిందో, ఎంత నష్టం జరిగిందో, ఎన్నివేల మంది జీవితాలు కోల్పోయారో టి.వి. లో పదేపదే చూపిస్తున్నారు. ఏ పత్రికలలో చూసినా అదే న్యూస్. ఆ టెర్రరిస్టులు, విమానాలను మారణాయుధాలుగా ఉపయోగించి ప్రపంచానికే ఎంత కష్టం కలిగించారో కళ్ళెదుట కనిపిస్తోంది. తను కూడా అలా కాలగర్భంలో కలిసిపోతే ఎంత బాగుండేది. ఇప్పుడిలా రెండు కాళ్ళూ పోగొట్టుకుని ఏం చేయాలి? ఏమయినా ఈ విషయం స్వాతికి తెలియటానికి వీల్లేదు. తను ఎంత బాధ పడుతుందో ఊహించగలడు. స్వాతి జీవితంలో సుఖపడాలి. తనకు ఏకష్టం రాకూడదు. ఏదో విధంగా స్వాతి తన నుండి దూరం అయేట్లు చూడాలి. తనంటే కోపం, అసహ్యం కలిగేట్లు చూడాలి.

డాక్టరు రౌండ్స్‌కు రావటంతో రాహుల్ ఆలోచనా స్రవంతి ఆగిపోయింది.

ఆరోజు ఆదివారం. రాహుల్ హాస్పిటలు నుండి డిశ్చార్జి అయి ఒక వారం అవుతోంది. నెమ్మదిగా క్రచెస్‌తో అడుగులు వేయటం అలవాటయింది. ఇంకా ప్రోస్తిసిస్ ఇవ్వటానికి టయిము పడుతుందన్నారు. నెలరోజులు గడిచినా తను వ్రాసిన ఉత్తరానికి స్వాతి నుండి తను ఆశించిన సమాధానం రాలేదు.

కాలింగ్ బెల్ వినబడితే నెమ్మదిగా వెళ్ళి తలుపు తీశాడు.

"రాహుల్ మీరేనా? నాపేరు సుధీర్ నేను మీకు తెలియదు. నేను మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి."

"రండి కూర్చోండి."

"నేను బోస్టన్ లో ఉంటాను. స్వాతిగారు నాకు ఫోన్ చేసి మిమ్మల్ని కలిసి వివరాలు తెలుసుకోమన్నారు." కొంచెం ఆగి నెమ్మదిగా అన్నాడు సుధీర్ "మిమ్మల్ని చూశాక నాకు విషయం పూర్తిగా అర్థమవుతోంది. మీరు స్వాతికోసం త్యాగం చేద్దామనుకున్నారు. కాని ఆమె ఎంత తల్లడిల్లిపోతోందో ఊహించారా? ఇంత త్యాగం చేస్తున్నారంటే, మీరామెని ఎంతగా ప్రేమిస్తున్నారో అర్థమవుతోంది. మరి ఆమె కూడా మిమ్మల్ని అంతగానే ప్రేమిస్తోంది కదా! నిజం దాచి పెట్టి ఆమెకు మంచి ఎలా చేద్దామనుకున్నారు? మీరు చాలా పొరపడుతున్నారు. కష్టంలోనూ, సుఖంలోనూ తోడుగా ఉండాలనుకునే సహచరిని ఇలా మభ్యపెట్టి దూరం చేసుకోవటం అవివేకం. ఆలోచించండి."

రాహుల్ ముఖంలో విపరీతమయిన నిరాశ కనిపిస్తోంది. "సుధీర్ గారూ స్వాతికి మంచి జీవితాన్ని కల్పించాలని నా తాపత్రయం. ఇలా చేస్తే ఆమె నన్ను అసహ్యించుకుని, నెమ్మదిగా మరిచిపోతుంది. ఆ తరువాత మరెవరినయినా పెళ్ళి చేసుకుని సుఖపడుతుందని నా ఆశ."

"సుఖమంటే ఏమిటి? మనసైన వారికి దగ్గరలో ఉండి, వాళ్ళ సుఖదుఃఖాలలో భాగంగా ఉండటం." కొంచం ఆగి మళ్ళీ సుధీర్ అన్నాడు. "విత్ యువర్ పర్మిషన్ నేను స్వాతిగారికి నిజం చెబుతాను. తరువాత ఆమె నిర్ణయం ఆమె చేసుకుంటారు."

విషయం తెలిసిన తరువాత స్వాతి వెంటనే విజిటరు వీసాకు అప్లై చేసింది. తన భర్త 9/11 ప్రమాదంలో కాళ్ళు పోగొట్టుకుని ఒంటరిగా ఉన్నాడని వివరించింది. వీసా వచ్చిన వెంటనే న్యూయార్క్ వచ్చేసింది.

"రాహుల్ ఎందుకిలా చేశావు? నేనెలా నమ్ము తాననుకున్నావు? నీవేమిటో నాకు తెలియదా? ఇదేనా నీవు నన్నర్థం చేసుకున్నది? కష్టసుఖాల్లో భాగస్తులుగా ఉంటామని ప్రమాణం చేసుకున్నాం. నీకింత కష్టం వస్తే నన్నిలా దూరంగా తోసివేస్తావా?"

"స్వాతీ నాతో పాటు, నీజీవితాన్ని కూడా ఈ చీకట్లోకి లాగటం నాకిష్టం లేక పోయింది."

రాత్రి చీకటి తరువాత పగటి వెలుగు వస్తుంది రాహుల్! అది ప్రకృతి ధర్మం - మనకూ ఈ చీకటిలో నుండి వెలుగులోకి దారి కనిపిస్తుంది. రాహుల్!"

"నేను పొరపాటుగా ఆలోచించాను స్వాతీ! నన్ను క్షమించు."

"అయినా నన్ను విడిచి ఒంటరిగా ఎలా ఉండగలననుకున్నావు? నీవు లేకుండా నేను ఎలా సుఖపడతాననుకున్నావు?"

"స్వాతీ ఇలా కుంటివాడిగా బ్రతికేకంటే ఆ ప్రమాదంలో చనిపోతే ఎంతో బాగుండేది."

"అలా అనకు రాహుల్! నా అదృష్టం వల్ల నీవు బ్రతికి బయటపడ్డావు. కాళ్ళు లేకపోతే ఏమయింది రాహుల్! ఆలోచించే జ్ఞా నం ఉంది. అన్నిటికంటే మించి ప్రేమించే మనసు ఉంది. - రాహుల్ నీమనసు కల్మషం అంటని స్వాతిముత్యం లాంటిది. అలాంటి స్వాతి ముత్యాన్ని నేనెలా వదులుకోగలను? రాహుల్!"